క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

పెద్దారవీడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జాన్‌సుందరం బుధవారం తెలిపారు. సమావేశానికి వచ్చే అధికారులు తమకు సంబంధించిన శాఖల రికార్డులు తప్పనిసరిగా తీసుకు రావాలని, ప్రజాప్రతినిధులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, జెడ్పీటీసీ, మండల కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

కేంద్రియ విద్యాలయంలో ఉత్తమ ఫలితాలు

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి సమీపంలో కేంద్రియ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ కర్తర్‌సింగ్ గుర్జర్ బుధవారం సాయంత్రం తెలిపారు. సీబీఎస్‌ఈ సిలబస్ ద్వారా మొత్తం 28 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అంతా పాసయ్యారని, విద్యాలయంలో నూరు శాతం విద్యార్థులు పాస్ చేసేందుకు ఉపాధ్యాయులు కృషి ఎంతో ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. పాసైన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభిందనలు చెప్పారు.

52 మందికి కంటి ఆపరేషన్లు

కురిచేడు: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆస్పత్రి సహకారంతో 52 మందికి కంటి ఆపరేషన్లు చేయించేందుకు బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రోగులను పంపినట్లు ఆప్తాల్మిక్ అధికారి బీజేఎస్ హెరాల్డ్ తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో వృద్ధులకు కంటి పరీక్షలు జరిపి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించినట్లు తెలిపారు. వారందరినీ ఏకం చేసి ఆపరేషన్‌కు పంపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.ప్రవీణ్, వి.రవితేజకుమార్, గురుస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు..లారీ ఢీ

● త్రుటిలో తప్పిన ప్రమాదం

తాళ్లూరు: వెల్లంపల్లి రహదారిలో శివరామపురం మలుపు వద్ద ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు–లారీ ఢీకొంది. ఈ సంఘటన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపురం మలుపు వద్ద తాళ్లూరు నుంచి వెల్లంపల్లి వైపు వెళ్తున్న లారీ.. ఒంగోలు నుంచి తాళ్లూరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. ప్రమాదంలో ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

గ్రామాల్లో రోడ్లు శుభ్రంగా ఉంచాలి



షెడ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

ముండ్లమూరు (కురిచేడు): గ్రామాల్లో రోడ్ల వెంట చెత్తకుప్పలు, నైదిబ్బలు ఉండరాదని, రోడ్లు శుభ్రంగా ఉండాలని ఎంపీడీఓ పి.సునీత ఆదేశించారు. మండలంలోని పెద్ద ఉల్లగల్లు గ్రామ పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్డును బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో తడిచెత్త, పొడి చెత్తను వేర్వేరుగా షెడ్డు వద్దకు తీసుకురావాలని సిబ్బంది ఆదేశించారు. చెత్త నుంచి సంపదను తయారు చేయాలని సూచించారు. వర్మి కంపోస్టు ప్రాసెస్‌ను ఆమె పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీఓ ఆర్.జనార్దన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జె.రాజరాజేశ్వరి, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

52 మందికి కంటి ఆపరేషన్లు



వృద్ధులను ఆస్పత్రికి పంపుతున్న వైద్యులు

కురిచేడు:

జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆస్పత్రి సహకారంతో 52 మందికి కంటి ఆపరేషన్లు చేయించేందుకు బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రోగులను పంపినట్లు ఆప్తాల్మిక్ అధికారి బీజేఎస్ హెరాల్డ్ తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో వృద్ధులకు కంటి పరీక్షలు జరిపి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించినట్లు తెలిపారు.

వారందరినీ ఏకం చేసి ఆపరేషన్‌కు పంపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.ప్రవీణ్, వి.రవితేజకుమార్, గురుస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్కడ సిజేరియన్లకు దూరం

- సామాజిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు
- గతంలో కంటే పెరిగిన ప్రసవాల సంఖ్య
- నాలుగు నెలల్లో 82 సాధారణ ప్రసవాలు
- ప్రభుత్వ వైద్యశాలల్లోనే శ్రేయస్కరమంటున్న వైద్యులు



గర్భిణికి స్కానింగ్ చేస్తున్న ప్రభుత్వ వైద్యుడు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ వైద్యులు గర్భిణులకు సాధారణ ప్రసవాలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో గత నాలుగు నెలలుగా చేసిన 101 ప్రసవాల్లో 82 ప్రసవాలు సాధారణ ప్రసవాలు కావడం విశేషం. గతంలో గర్భిణులు ప్రసవాల కోసం మండల కేంద్రానికి సమీపంలో ఉన్న మార్కాపురం, యర్రగొండపాలెం వంటి అభివృద్ధి చెందిన ప్రాంతాలకు వెళ్లేవారు. గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలు మెరుగు పడటంతో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వైద్యశాలలో గర్భిణులకు శస్త్ర చికిత్సలు చేయడంతో పాటు అందుబాటులో ల్యాబ్, గర్భిణులకు స్కానింగ్, నిరంతర పర్యవేక్షణ, ప్రసూతి వార్డుల్లో ఏసీలు ఏర్పాటు చేయడంతో సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెరగటంతో నిరుపేద గర్భిణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజులు అధికం

ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవమైనా.. శస్త్ర చికిత్స అయినా ఫీజులు వసూలు చేయడంలో ఏ మాత్రం తగ్గింపు ఉండటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు సిజేరియన్‌తో కాన్పు అయ్యాక అప్పుడే పుట్టిన చిన్నారులను ఉమ్మనీళ్లు తాగిందని, కళ్లు పచ్చగా ఉన్నాయన్న పలు రకాల కారణాలు చూపిస్తూ వైద్యం పేరుతో చిన్న పిల్లల వైద్యశాలల్లో కొన్ని గంటల పాటు తల్లికి దూరంగా ఉంచడంతో పాటు చికిత్సల పేరుతో వేల రూపాయలు ఖర్చు చేయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు కొందరు వైద్యులు సమయం ఆదా చేసుకునేందుకు, పని సులువుగా పూర్తి చేసేందుకు సిజేరియన్లకే మొగ్గు చూపుతున్నారని బాధితులు పేర్కొంటున్నారు. దీంతో పాటు గంటల తరబడి ఎదురు చూడలేక ఓపిక పట్టడం చేతగాక ఐదు నిమిషాల్లో పూర్తయ్యే శస్త్ర చికిత్సలకు చాలా మంది అలవాటు పడిపోతున్నారు. ఏది ఏమైనా గర్భిణులకు సాధారణ ప్రసవాలతో కలిగే లాభాలు వివరించి వీటికే మొగ్గు చూపేలా చేయాలన్న అభిప్రాయం అందరిలో వ్యక్తమవుతోంది. శస్త్ర చికిత్సలు బాలింతల భవిష్యత్తు ఆరోగ్యంపై ఏ మాత్రం ప్రభావితం చేస్తాయో తెలిపేలా అవగాహన కల్పించడంతో పాటు శస్త్ర చికిత్సలు తగ్గించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు.

నాలుగు నెలలుగా జరిగిన ప్రసవాలు

నెల	మొత్తం కాన్పులు	సాధారణ కాన్పులు	సిజేరియన్లు
జనవరి	29	26	3
ఫిబ్రవరి	24	21	3
మార్చి	24	17	7
ఏప్రిల్	24	18	6

సాధారణ కాన్పుల శాతం మరింత పెంచుతాం:

సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా గర్భిణులకు ప్రసవాలు చేసేందుకు అవసరమైన వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారు. సిజేరియన్‌కు అవకాశం లేకుండా సాధారణ ప్రసవం చేసేందుకే అన్ని రకాలుగా సిద్ధంగా ఉంటున్నాం. రానున్న రోజుల్లో సాధారణ ప్రసవాల శాతం మరింత పెరిగేలా కృషి చేస్తాం.

– డాక్టర్ వైద్య సంజీవ్, సూపరింటెండెంట్, సామాజిక ఆరోగ్య కేంద్రం, పెద్దదోర్నాల

తాగునీటి కోసం కలెక్టర్‌కు విన్నవిద్దాం

దొనకొండ (కురిచేడు):

తాగునీరు లేక కొన్నేళ్ల నుంచి ఇబ్బంది పడుతున్నామని, ఈ విషయాన్ని మండలంలోని అన్ని పార్టీల నాయకులు కలెక్టర్‌కు విన్నవించేందుకు సన్నద్ధం కావాలని కోరారు. ఎన్ఏపీ వాటర్ స్కీం పాతదై పైప్‌లైన్, మోటార్లు, ఫిల్టర్ బెడ్లు, నిటిని నింపే సామర్థ్యం ఉన్న మోటార్లు లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. నీటి సరఫరా ఎప్పుడు జరుగుతుందో తెలియక, నీటి సరఫరా జరిగే సమయంలో నిరంతరం పైపులు పగలటం, లీకేజీ అవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చందవరం నుంచి దొనకొండ వరకు కొత్త పైపులైను ఏర్పాటు చేస్తే నీటి సమస్య తీరుతుందని, బాదాపురం పెద్ద చెరువును మంచినీటి రిజర్వాయర్‌గా నిర్మించుటకు, మండల ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఏకరువు పెడుతూ ఉన్నతాధికారులు, మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులకు, కలెక్టరు తమీమ్ అన్సారియాకు ప్రజలందరూ రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా కలిసి విన్నవించేందుకు ముందుకు రావాలని కోరారు.

పచ్చని చెట్ల కింద సేద తీరుతున్న ప్రజలు



చెట్ల కింద సేద తీరుతున్న ప్రజలు

పెద్దారవీడు: ఎండన పడి తిరిగే వారిని కాసేపు సేద తీర్చుకోండని చెట్లు పిలుస్తున్నాయి. మండల ప్రభుత్వ కార్యాలయంలో పూర్వ కాలం పెద్ద చెట్లు ఉన్నాయి. దాతల సాయంతో చెట్ల చుట్టూ అరుగులు కట్టించారు. ఎర్రటి ఎండకు ఆకులతో గొడుగు పట్టి తన ఒడిలో కూర్చున్న వారికి ప్రాణ వాయువు అందిస్తూ ఉంటున్నాయి. మండల పరిషత్, తహసీల్దార్, సొసైటీ, వెలుగు, హౌసింగ్, ఉపాధి పథకం, పశు వైద్యశాల, మండల విద్యాశాఖ కార్యాలయాలు ఒకే ఆవరణలో ఉన్నాయి. మండల ప్రజలు వివిధ పనుల కోసం కార్యాలయాల వద్దకు వస్తుంటారు. ముగ్గురు దాతలు మూడు చెట్ల చుట్టూ వేలాది రూపాయలు వెచ్చించి అరుగులు నిర్మించారు. ఎండ వేడిమి తట్టుకునేందుకు మూడు చెట్ల చుట్టూ ఉన్న అరుగులపై కొద్దిసేపు కూర్చొంటారు. చుట్టూ ఎండ తాండవం చేస్తున్నా చెట్ల నీడలో మాత్రం ఏసీ పెట్టినట్లే చల్లటి గాలి వీస్తుంది. దాదాపు 150 ఏళ్ల వయసున్న చెట్లుగా స్థానికులు చెబుతున్నారు. విశాలంగా వ్యాపించి కొమ్మల ఆకులతో అరుగుల చుట్టూ నీడ అల్లుకుంది. సొసైటీ కార్యాలయం ఆవరణలో ప్రస్తుతం కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి రైతులు చెట్ల కింద అరుగులపై సేద తీర్చుకుంటున్నారు. చెట్ల నీడలో ఎంతో హాయిగా ఉందని రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల కార్యాలయాల ఆవరణంలో దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం చలివేంద్రం ఏర్పాటు చేస్తే బాగుండేదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి



కరస్పాండెంట్‌లతో మాట్లాడుతున్న ఎంఈఓలు

తాళ్లూరు: గుర్తింపు పొందిన పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలను తప్పకుండా పాటించాలని మండల విద్యాశాఖాధికారులు జి.సుబ్బయ్య, సుధాకర్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల కరస్పాండెంట్స్, ప్రధానోపాధ్యాయులతో వారు సమావేశమయ్యారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు సీఎస్సీ వెబ్ సైట్‌లో ఫామ్–1ను నిర్ణీత సమయంలో పూర్తి చేసి సమాచారం అందించాలని చెప్పారు. మండలంలో 15 ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రాథమిక, హైస్కూల్స్ ఉన్నాయని, ఇప్పటికి కేవలం మూడు మాత్రమే పూర్తి చేసినట్లు చెప్పారు. ఎంఈఓ–2 సుధాకర్‌రావు మాట్లాడుతూ ఎస్ఏ –2 మార్కులను నమోదు చెయ్యాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు తూచ తప్పకుండా పాటిస్తూ పాఠశాలలు నడిపించాలని కోరారు.

వాహనదారులకు ఇక్కట్లు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల రైల్వే గేట బుధవారం మరమ్మతులకు గురికావడంతో వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధదవారం సాయంత్రం రైళ్ల రాకపోకల సమయంలో రైల్వే సిబ్బంది గేటు వేశారు. రైళ్లు వెళ్లిన తర్వాత ఇరువైపులా గేట్లును ఎత్తేందుకు సిబ్బంది ప్రయత్నించగా సాంకేతిక సమస్య కారణంగా తెరుచుకోలేదు. దీంతో గంట పాటు వాహనదారులు వేచిఉండాల్సి వచ్చింది. రాచర్ల గేటు అవతలి వైపు మార్కెట్ యార్డు వరకు, ఇవతలి వైపు కుమ్మరాంకట్ట సెంటర్ వరకు వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గేట్లకు మరమ్మతులు చేయడంతో ముందుకు సాగారు. రాచర్ల గేటు వద్ద వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.307 కూలి వచ్చేలా మార్కింగ్ ఇవ్వాలి

● డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

ముండ్లమూరు (కురిచేడు): ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రోజు కూలి 307 రూపాయలు వచ్చేలా మేట్లు మార్కింగ్ ఇవ్వాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జి.జోసఫ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని పసుపుగల్లు, ఉల్లగల్లు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన బుధవారం తనిఖీ చేశారు. వాటర్ హార్ వెస్టింగ్ పాండ్, ఫారం పాండ్‌లను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ కూలీలు రోజూ ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనిచేయాలన్నారు. వేతనాలకు సంబంధించి 10 రోజుల్లో కూలీల అకౌంటులో నగదు జమ అవుతుందని చెప్పారు. గ్రామ పంచాయతీల్లో పండ్ల మొక్కల పెంపకం, చెరువుల అభివృద్ధి పనులు, ఫిష్ బ్రీడింగ్ పాండ్స్, కంపోస్ట్ పిట్స్ అంచనాలు తయారు చేసి పంపాలని సిబ్బందికి సూచించారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు సూచించారు. ఎంపీడీఓ పి. సునీత, ఏపీడీ లలితకుమారి, ఏపీఓ టి.వెంకట్రావు, ఈసీ శివరామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రంలో ఈ నెల 15వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 13వ శ్రీరామ నామ సప్తాహ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు, కమిటీ సభ్యుడు యక్కంటి తిరుపతిరెడ్డి తెలిపారు. 15న శ్రీలక్ష్మీనారాయణ స్వామి కల్యాణం, 16న శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం, 17న రమాసహిత సత్యనారాయణస్వామి కల్యాణం, 18న శ్రీరుక్మిణి, సత్యభామ సహిత వేణుగోపాలస్వామి కల్యాణం, 19న శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వరస్వామి కల్యాణం, 20న సీతారాముల కల్యాణం, 21న సీతారామ చంద్రస్వామి పట్టాభిషేకం, పూర్ణాహుతి, 22వ తేదీన హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆకు పూజ, సర్వదేవతా దర్శనం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నిత్యం భక్తులకు అన్న సంతర్పణ చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

వైఎస్ జగన్‌ను కలిసిన పిడతల ప్రవీణ్



గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్‌రెడ్డి కుమారుడు వైఎస్సార్ సీపీ నాయకుడు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల విస్తృత తనిఖీలు



మీటర్ల రికార్డులు పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

గిద్దలూరు రూరల్: విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులతో కూడిన బృందాలు బుధవారం గిద్దలూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాయి. మీటర్లు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఆరుగురు, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీలో విద్యుత్ వాడుకుంటున్న 8 మంది, అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న ఏడుగురు, మీటరు లేకుండా నేరుగా విద్యుత్ వాడుతున్న 13 మందిని గుర్తించి మొత్తం రూ.2.42 లక్షల అపరాధ రుసుం విధించారు. విద్యుత్ శాఖ అధికారులు 37 బృందాలుగా విడిపోయి ఈ దాడులు నిర్వహించారు. తనిఖీల్లో డీఈఈ బి.శేషగిరిరావు, మార్కాపురం, కంభం డీఈఈతో పాటుగా స్థానిక ఏఈ నారాయణరెడ్డి, విజిలెన్స్ అధికారుల బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఈ శేషగిరిరావు మాట్లాడుతూ.. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ నేత సతీమణికి ‘అన్నా’ పరామర్శ

గిద్దలూరు రూరల్: స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు సూరా పాండురంగారెడ్డి భార్య నారాయణమ్మ అనారోగ్యానికి గురై పట్టణంలోని డీజీఆర్ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పాండురంగారెడ్డితోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు సీఆర్‌ఐ మురళి, అన్నా రంజిత్ తదితరులు ఉన్నారు.

మురుగు పారదు.. దోమలు వెళ్లవు!



ఇళ్ల ముందే పేరుకున్న మురుగు

పుల్లలచెరువు: పంచాయతీలకు నిధులు వస్తున్నా పారిశుధ్యంపై అధికారులు దృష్టి పెట్టడం లేదని ఆయా గ్రామాల్లోని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని తెల్లగట్లలో ఇళ్ల వద్దే మురుగు పారుతోంది. మురుగు పారదు.. అధికారులు పట్టించుకోరు.. అన్న తీరుగా ఉంది. దోమలు ఇలా ఉంటే రోగాలు రాక ఏం వస్తాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏ రోజూ ఇక్కడి మురుగు కాలువల్లో మురుగు తీసిన దాఖలాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పంచాయతీ సిబ్బంది స్పందించి మురుగు తొలగించాలని కోరుతున్నారు.

పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వినియోగదారులకు అవగాన కల్పిస్తున్న ఏఈ కిశోర్

పుల్లలచెరువు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్య ఘర్ యోజనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ కిశోర్ కోరారు. ఆయన బుధవారం మండలంలోని కవలకుంట్లలో పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి రాయితీపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించుకుంటున్న ఎస్సీ, ఎస్టీలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా కేంద్ర ప్రభుత్వం సోలార్ ప్యానల్ ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ఇతరులు కిలో వాట్ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకున్న వారికి రూ.18 వేల సబ్సిడీ, రెండు కిలోవాట్లు సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుంటే రూ.30 వేలు, మూడు కిలోవాట్ల సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుంటే రూ.78 వేల రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ కనెక్షన్ కలిగి సొంత ఇల్లు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో

గృహోపకరణాలు దగ్ధం

పొదిలి రూరల్: పొదిలి మండలం అన్నవరం పంచాయతీలోని చింతగుంపల్లి ఎస్సీ కాలనీలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయింది. కాలనీకి చెందిన గుంటూరి సురేష్, గుంటూరి దేవయ్య, గుంటూరి ఇసాక్‌కు చెందిన 3 గృహాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో వస్తువులు కాలిపోయి పొగలు వచ్చాయి. దీంతో ఆయా నివాసాల్లో ఉన్నవారు భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. కాలనీకి సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఒరిగిపోయి, విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండటమే ప్రమాదానికి కారణమని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని కాలనీ వాసులు ఆరోపించారు.

కార్డన్ సెర్చ్‌లో 25 వాహనాలు సీజ్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని అల్లూరి పోలేరమ్మ గుడి ఏరియా, హోంగార్డు కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో బుధవారం వేకువజామున సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో 50 మంది పోలీసు సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 25 వాహనాలు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు ఎవరైనా ఉంటే సమాచారం అందించాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేవారు ముందుగా పోలీసులకు సమాచారం అందిస్తే నిఘా పెడతామని చెప్పారు. తనిఖీల్లో ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, అంకమరావు, అహరోన్, ఏఎస్సైలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, రాజకుమార్ పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ముగ్గురికి గాయాలు

కంభం: ద్విచక్రవాహనం, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం ఉదయం కంభం–తర్లుపాడు రోడ్డులో చోటుచేసుకుంది. వివరాలు.. కందులాపురం కూడలి నుంచి ముగ్గురు యువకులు తర్లుపాడు రోడ్డులో బైక్‌పై వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టి కిందపడిపోయారు. ఆటో అద్దం పగిలిపోగా, ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పట్టణంలో ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. స్థానిక ఎస్సై నరసింహారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు.